సాక్షి జనగామ

ఆదివారం । 2 । జూలై । 2023



భయం..బంధాన్ని దాచింది

కళ్లేదుటే అన్న నీటిలో మునిగినా.. తమ్ముడు 'భయం'తో కుటుంబ సభ్యులకు చెప్పలేదు. ఫలితంగా బాలుడు కనిపించని లోకాలకు వెళ్లాడు. - 8లో▸



విద్యుత్ ప్రమాదాలతో జాగ్రత్త

వర్షాకాలం విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$35^0/27^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

డాక్టర్లకు సత్కారం



జనగామ: డాక్టర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఖాజాషరీఫ్ ఆధ్వర్యంలో శనివారం మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్ ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, డాక్టర్లను సత్కరించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రశాంత్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

జనగామ : లంబాడీ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజ్మీరా స్వామినాయక్ అన్నారు. లంబాడా హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కౌన్సిలర్ వి.అనిత, గోవర్ధన్ నాయక్, జేరాం నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల్లో పురోగతి సాధించాలి



జనగామ : అపరిష్కృత కేసుల్లో అడ్వకేట్లు పురోగతి సాధించాలని ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్ అడ్వకేట్ ఫ్యాకల్టీ ఆదోని లత సూచించారు. శనివారం స్థానిక బార్ అసోసియేషన్‌లో సివిల్ ప్రొసీజర్ కోర్టు, ఫోరెన్సిక్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఫింగర్ ప్రింట్స్, ఎన్‌డీపీఎస్ యాక్ట్, డ్రగ్స్, ప్రామిసరీ నోటు, చెక్ బౌన్స్ తదితర అంశాలపై వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల సాయిబాబా పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య అమరత్వం చరిత్రాత్మకం

జనగామ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అమరత్వం చరిత్రాత్మకంగా నిలిచిందని కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేష్ అన్నారు. కొమురయ్య వారసుడు దొడ్డి చంద్రం ఆధ్వర్యాన ఈనెల 4న కడవెండిలో చేపట్టే స్మారక విగ్రహావిష్కరణ వాల్ పోస్టర్‌ను శనివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కురుమ సంఘం బాధ్యులు ఆలేటి సిద్దిరాములు, మోటె శ్రీను, నోముల సోమయ్య, పిక్క బీరప్ప, బొర్రెల్లి సిద్దులు, మోటె మల్లేశ్, ఎ.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

జనగామ: తెలంగాణ ప్రాంత విద్యార్థుల ఫీజు బకాయిలను ప్రభుత్వం సత్వరమే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడు పండుగ హరీష్ డిమాండ్ చేశారు. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు శనివారం కలెక్టరేట్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఏఓ మన్సూర్‌అలీకి వినతిపత్రం అందజేశారు. పండుగ అశోక్, చింతకింది హరీష్, దాసరి అశోక్, కడకంచి కరుణాకర్, వంగాల శ్రీకాంత్, చెవ్వ రమేష్, కార్తీక్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు

విచారణ చేపట్టాలి

జనగామ రూరల్: రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణయ్య హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నాయకులు ప్రకాష్, రాపర్తి రాజు, అహల్య, బొట్ల శ్రీనివాస్, ఉపేందర్, విజేందర్, కళ్యాణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులకు విఘాతం కలిగిస్తున్నారు



జనగామ: శాసనసభ్యుడిగా నిర్వహిస్తున్న విధులకు తన కూతురు అల్లుడు తుల్జాభవానీరెడ్డి, రాహుల్‌రెడ్డి ఆటంకపరుస్తూ.. రాజ్యాంగపరమైన హక్కులకు విఘాతం కలిగిస్తున్నారని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ డయాగ్నోస్టిక్స్‌లో నూతన టెస్టుల ప్రారంభోత్సవం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుటుంబ సమస్యలను అంతర్గతంగా పరిష్కరించుకోవాల్సి ఉండగా.. తన కూతురు కావాలని అధికారిక కార్యక్రమాల వద్దకు వచ్చి అడ్డుకుంటోందన్నారు. దీని వెనుక అంతర్యమేమిటో అర్థం కావడంలేదని వాపోయారు.

84.7% హాజరు

జనగామ ఏబీవీ జూనియర్ కళాశాల కేంద్రంలో పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు



- ముగిసిన గ్రూప్–4 పరీక్ష
- జిల్లా వ్యాప్తంగా 1,697 మంది గైర్హాజరు
- పరీక్ష తీరును పరిశీలించిన కలెక్టర్, డీసీపీ
- ఆలస్యంగా వచ్చిన నలుగురు అభ్యర్థులకు తిరస్కరణ

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జనగామ పట్టణం, స్టేషన్‌ఘన్‌పూర్, లింగాలఘణపురం, బచ్చన్నపేట, రఘునాథపల్లిలో మొత్తం 29 సెంటర్లలో ఉదయం, మధ్యాహ్నం రెండు పేపర్లుగా ఈ పరీక్ష నిర్వహించారు. 10,654 మంది అభ్యర్థులకు 8,957(84.7 శాతం) మంది పరీక్ష రాయగా.. 1,697 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తో పోలీసులు భద్రత కల్పించినట్లు డీసీపీ సీతారాం పేర్కొన్నారు. అభ్యర్థుల వద్ద ఎలక్ట్రానిక్ పరికరాలు, చేతి గడియారాలు, కీచైన్లు తదితర వస్తువులు లేకుండా ముందస్తుగా సిబ్బంది తనిఖీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీఆర్ స్కూల్, ఆర్ఎంఎం కళాశాల సెంటర్లను కలెక్టర్ పరిశీలించారు.

ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు..

పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందు సెంటర్ల గేట్లు మూసి వేశారు. అయితే స్టేషన్‌ఘన్‌పూర్ టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల(బాలురు) పరీక్ష కేంద్రానికి ఇప్పగూడెంకు చెందిన అభ్యర్థి డి.వేణు, శ్రీపతిపల్లికి చెందిన రజని, అలాగే.. లింగాలఘణపురం మోడల్‌స్కూల్ సెంటర్‌కు జనగామ ప్రాంతానికి చెందిన అంజలి, స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన రాజు ఆలస్యంగా వచ్చారు. బతిమాలినా కేంద్రాల నిర్వాహకులు లోనికి అనుమతించకపోవడంతో వెనుదిరిగారు.

సెయింట్ మేరీస్ హైస్కూల్ సెంటర్‌లో..



ఏకశిల హైస్కూల్ పరీక్ష కేంద్రంలో..







స్టేషన్‌ఘన్‌పూర్, లింగాలఘణపురం సెంటర్లకు ఆలస్యంగా వచ్చి అధికారులను బతిమాలుతున్న అభ్యర్థులు

ఆరు నెలలు కష్టపడి చదివా..

జనగామ ప్రాంతానికి చెందిన అంజలి కుటుంబ సభ్యులు హైదరాబాద్ సూరారంలో ఉంటున్నారు. అంజలి ట్రైన్‌లో జనగామకు చేరుకుని లింగాలఘణపురం మండల కేంద్రంలోని సెంటర్‌కు చేరుకునే సరికి ఆలస్యమైంది. 'ఆరు నెలలు కష్టపడి చదివాను.. పరీక్ష సమయానికి ఆలస్యంగా రావడంతో ఇన్ని రోజుల శ్రమ వృథా అయింది' అంటూ ఆమె వాపోయింది.

- మరిన్ని వివరాలు 9లో▸

ఉండేదెవరు.. ఊడేదెవరు..!?

'అధికార' సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఆందోళన

- రోజుకో వివాదంతో కొందరు ఉక్కిరిబిక్కిరి
- ఈసారి టికెట్ అనుమానమేనన్న ఊహాగానాలు
- ఉమ్మడి వరంగల్‌లో మారుతున్న రాజకీయ సమీకరణలు



సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీటు గుబులు పట్టుకుందా.. ఈసారి సీటు కష్టమేనా.. అంటే ఇటీవల చోటుచేసుకుంటున్న ఘటనలు.. వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణలు చూస్తుంటే అవుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గులాబీ దళనేత, సీఎం కేసీఆర్.. మంత్రి కేటీఆర్‌లు వేర్వేరుగా విస్తృతంగా జిల్లాల పర్యటన చేస్తున్నారు. సుమారు నెలన్నర రోజుల వ్యవధిలో మంత్రి కేటీఆర్ ఉమ్మడి వరంగల్‌లో ఐదు పర్యాయాలు పర్యటించారు. ఇదే సమయంలో నిర్వహించిన సభల్లో పలువురు సిట్టింగ్‌ల టికెట్లపై భరోసా ఇచ్చారు. ఇంకొందరి విషయంలో క్లారిటీ ఇవ్వని ఆయన.. మహబూబాబాద్ పర్యటనలో కొందరితో మాట్లాడటానికే ఇష్టపడలేదు. పార్టీవర్గాలు, ఇంటెలిజెన్స్ నివేదికల ఆధారంగా పలువురు ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఇన్నాళ్లు సిట్టింగ్‌లకే సీట్లు అన్నది ఏ మేరకు తమకు అనుకూలంగా ఉంటుందోనన్న ఆందోళన పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నిద్ర లేకుండా చేస్తోంది. తీరా ఎన్నికల్లో అధిష్టానం పోటీలో నిలిపేదెవరిని? తప్పించేదెవరిని? అన్న చర్చ జరుగుతోంది.

వివాదాల సుడిగుండంలో పలువురు...

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు పలువురు వివాదాల సుడిగుండంలో చిక్కుకున్నారు. ఆ వివాదాలు రోజుకో మలుపు తిరుగుతుండడాన్ని అధిష్టానం సీరియస్‌గా తీసుకుంటోంది.

- జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని భూ ఆక్రమణల ఆరోపణలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ వివాదానికి సొంత కూతురు తుల్జాభవానీరెడ్డి కూడా కారణం కావడం చర్చనీయాంశంగా మారింది. చివరకు తన ఫిర్యాదులను పట్టించుకోవడం లేదంటూ ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి.. హోంసెక్రటరీ, డీజీపీ, ఇద్దరు డీసీపీలు, సీఐలు, కూతురుపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి ఎదురుదాడికి దిగడం కూడా దుమారం రేపుతోంది.
- మాజీ ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, తాటికొండ రాజయ్యల మధ్య వివాదానికి కేంద్ర బిందువైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో సొంతపార్టీలో కుంపటి చల్లారడం లేదు. జానకీపురం సర్పంచ్ కుర్సపల్లి నవ్య.. లైంగిక ఆరోపణలతో ఎమ్మెల్యే రాజయ్యపై మహిళా కమిషన్, పోలీసులకు ఫిర్యాదు చేసే వరకు వెళ్లడం పార్టీకి తలనొప్పిగా మారింది.
- దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో పర్యటించిన డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను అడుగడుగునా ప్రజలు అడ్డుకుని సమస్యలపై నిలదీశారు.
- వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను ఆ నియోజకవర్గంలో ప్రతికూల పరిస్థితులు వెంటాడుతున్నాయి. ఇటీవల నిర్వహించిన బహిరంగసభకు హాజరైన మంత్రి కేటీఆర్ నరేందర్ టికెట్ విషయమై క్లారిటీ ఇవ్వలేదు. కొందరు కార్పొరేటర్లు వేరు కుంపట్లు పెట్టి కంట్లో నలుసులా మారారు. నేతల మధ్య సమన్వయం లేక మేయర్ సుధారాణి, ఎమ్మెల్సీ సారయ్య, నరేందర్‌లు మూడు గ్రూపులుగా సాగుతుండడం పార్టీకి డ్యామేజ్ అని భావిస్తున్నారు.
- మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, రెడ్యానాయక్‌ల మధ్య నడుస్తున్న 'మూడు ముక్కలాట'పార్టీకి చేటు తెచ్చేలా ఉందని గ్రహించిన అధిష్టానం త్వరలోనే కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది.

రెండు, మూడు స్థానాల్లో మార్పు..?

ఎప్పటికప్పుడు సర్వేల ద్వారా ప్రజాప్రతినిధుల పనితీరును బీఆర్ఎస్ అధిష్టానం తెలుసుకుంటోంది. మరోవైపు రాష్ట్ర నిఘా వర్గాల ప్రతినిధులు సైతం నియోజకవర్గాల్లో ఉన్న పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై పక్కాగా నిఘా పెట్టారని, వారి పనితీరు, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని సైతం మదింపు చేసి నివేదికలు పంపుతున్నామని ఓ ఇంటెలిజెన్స్ అధికారి ఒకరు 'సాక్షి ప్రతినిధి'కి వెల్లడించారు. మరోవైపు ప్రజాప్రతినిధులపై తీవ్ర ఆరోపణలు వస్తుండడమూ అభ్యర్థుల మార్పునకు సంకేతంగా నిలుస్తుందన్న వాదన వినిపిస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుత పరిస్థితుల్లో రెండు, మూడు స్థానాల్లో మార్పు ఉండవచ్చని, ఎన్నికలు సమీపించే నాటికి పెరగవచ్చన్న చర్చ కూడా ఉంది.

కంచుకోటను కాపాడుకునేందుకే..

ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్‌కు కంచుకోట. రెండు పార్లమెంట్, 11 అసెంబ్లీ స్థానాలతోపాటు 8 ఎమ్మెల్సీలు, ఆరు జిల్లా పరిషత్‌లను కైవసం చేసుకుని ప్రతిపక్షాలకు అందనంత దూరంలో ఉంది. తాజా రాజకీయ పరిణామాలతో సీన్ మారి పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో సిట్టింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 12అసెంబ్లీ స్థానాల్లో ఒక్క స్థానానికే పరిమితమైన కాంగ్రెస్ బలపడుతుండగా, బీజేపీ కూడా గతం కంటే పుంజుకుంది. ఇప్పుడున్న పరిస్థితుల ప్రకారం ఎన్నికలు జరిగితే ఉమ్మడి వరంగల్‌లో 6–7 స్థానాల్లోనే బీఆర్ఎస్‌కు విజయావకాశాలున్నట్లు నిఘావర్గాలు అధిష్టానానికి నివేదించినట్లు సమాచారం. దీంతో బీఆర్ఎస్‌కు కంచుకోట ఓరుగల్లు స్థానాలను పదిలపర్చుకునే దిశగా అధిష్టానం పావులు కదుపుతోంది. అవసరమైతే కొందరు 'సిట్టింగ్'లను తప్పించి గెలుపు గుర్రాలను ఎంపిక చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు పలువురికి సంకేతాలు కూడా అందాయన్న ప్రచారం జరుగుతోంది.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి



వర్చువల్‌గా మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



కొత్త టెస్టుల ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- వర్చువల్‌గా తెలంగాణ డయాగ్నోస్టిక్స్‌లో కొత్త టెస్టులు ప్రారంభం
- పలు సమస్యలు మంత్రి దృష్టికి తెచ్చిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ: ప్రజారోగ్య పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం జిల్లా ఏరియా ఆస్పత్రిలో తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ద్వారా కొత్తగా వచ్చిన 77 రకాల టెస్టులను కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వర్చువల్‌గా మంత్రి, స్థానికంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. టీ–డయాగ్నోస్టిక్స్‌లో ఇప్పటి వరకు 57 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేయగా.. ఇక నుంచి 134 టెస్టులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 10 కోట్లకు పైగా టెస్టులు నిర్వహించగా 57.68 లక్షల మంది రోగులు ప్రయోజనం పొందారని పేర్కొన్నారు. త్వరలో నిమ్స్ ఆస్పత్రిలో రోబోటిక్ మెషిన్‌ని ప్రారంభిస్తామని వెల్లడించారు. పేదలకు ఉచితంగా పరీక్షలు, చికిత్స, మందులు అందించే ఈ గొప్ప కార్యక్రమం సజావుగా కొనసాగేలా ఆస్పత్రి నిర్వాహకులు పాటుపడాలని కోరారు. ప్రభుత్వ వైద్యరంగం పురోగతికి వైద్య బృందం చేస్తున్న కృషిని అభినందిస్తూ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతివారం నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని చెప్పారు. ల్యాబ్‌లో టెస్టులకు ఎంత సమయం పడుతోంది.. టెస్టులు చేసిన తర్వాత రిపోర్టు ఎప్పుడు పంపిస్తున్నారని.. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజును అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాలకు సంబంధించి అడ్మిషన్లను మొదలు పెట్టి తరగతులను ప్రారంభించాలని ఆదేశించారు.

ముత్తన్నా.. అంటూ పలకరింపు..

ప్రారంభోత్సవం సందర్భంగా.. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని మంత్రి హరీశ్‌రావు ముత్తన్నా.. అంటూ పలకరించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని సదుపాయాలున్నాయని, సీటీ స్కాన్ యంత్రం ఇవ్వాలని కోరిన ఎమ్మెల్యే.. ల్యాబ్‌లో చిన్న చిన్న మెడికల్ పరీక్షలు చేసే కిట్లు అవసరమని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రశాంత్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు, టీఎన్‌జీఓ అధ్యక్షుడు ఖాజాషరీఫ్, నాయకులు మల్లిగారి రాజు, గుర్రం నాగరాజు, పంతులు ప్రభాకర్, ఉల్లెంగుల సందీప్, దేవరాయ నాగరాజు, నర్సింహులు, సతీష్, ఆర్ఎంఓ డాక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి బీఆర్ఎస్ ప్రభుత్వం

జనగామ : రాజకీయాలకు అతీతంగా పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పాటుపడుతోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధి సిద్దెంకి గ్రామంలో మృతి చెందిన పుప్పాల బీరయ్య కుటుంబానికి రూ.10వేలు, పెద్దరామన్‌చర్లలో వంగ రమాదేవి తిరుపతికి రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండ లక్ష్మి వెంకటేష్, గ్రామశాఖ అధ్యక్షుడు మడిపల్లి సుధాకర్, కళ్లెపు రాజు, రైతుబంధు కోఆర్డినేటర్ మల్లయ్య, లక్ష్మణ్‌గౌడ్, రవీందర్, సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్, నర్సింహారెడ్డి, నాగేందర్ రెడ్డి, భాస్కర్, నరేష్, అంజయ్య, రాజు, శ్రీను, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న కిరణ్‌కుమార్

విచారణ వేగవంతం

- రామకృష్ణయ్య హత్య కేసులో అంజయ్యకు మరో రెండురోజుల కస్టడీ
- సుభద్ర మృతదేహానికి రీ పోస్టుమార్టం!
- మరో ఏడుగురిపై పోలీసుల అనుమానం

బచ్చన్నపేట: రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య కేసు విచారణను పోలీసులు మరింత వేగవంతం చేశారు. నిందితుడు గిరబోయిన అంజయ్యతోపాటు సుపారీ గ్యాంగ్ భాస్కర్, శ్రీకాంత్‌లను శుక్రవారం వరంగల్‌లోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో అప్పగించిన పోలీసులు తిరిగి కస్టడీకి తీసుకున్నారు. శనివారం ఈ హత్య కేసులో మరికొందరు ఉన్నారన్న అనుమానంతో బచ్చన్నపేటతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. పలువురిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారిస్తున్నట్లు సమాచారం.

ముగ్గురి రిమాండ్

హత్య కేసులో గిరబోయిన అంజయ్యతో పాటు ఆయనకు సహకరించిన పోచన్నపేటకు చెందిన గట్టు మల్లేశం, గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన పస్తం జలేందర్, పస్తం పెద్ద ఉప్పలయ్యలను పోలీసులు రిమాండ్ చేసి కోర్టుకు తరలించారు.

మరో ఏడుగురిపై అనుమానం

రామకృష్ణయ్య హత్య కేసు విషయంలో విచారణ చేస్తుండగా మరో హత్య విషయం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. అంజయ్య బావమరిది భార్య సుభద్ర నక్కవానిగూడెం శివారులో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుండేది. వారికి పిల్లలు లేరు. బావమరిది మృతి చెందడంతో అత్తగారి ఆస్తికి సుభద్ర అడ్డు వస్తుందనే అనుమానంతో అంజయ్య ఆమెను సుపారీ ఇచ్చి 2022 అక్టోబర్‌లో హత్య చేయించాడు. ఆమె చనిపోయిన తరువాత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో నెలరోజుల అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. తాజాగా జరిగిన రామకృష్ణయ్య హత్య నేపథ్యంలో నిందితుడు అంజయ్య సుభద్రను హత్య చేయించినట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఆమె మృతదేహాన్ని నాలుగు రోజుల్లో తిరిగి బయటకు తీసి రీ పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ రెండు హత్యలతో సంబంధం ఉన్న మరో ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేయనున్నట్లు తెలిసింది.

భయం గుప్పిట్లో నాయకులు

అంజయ్యను మరో రెండు రోజులు కస్టడీకి తీసుకోవడంతో మండల నాయకుల్లో మళ్లీ భయం మొదలైనది. పోలీసుల నుంచి ఎవరికి.. ఎప్పుడు ఫోన్ కాల్ వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఆదివారం(నేడు) సాయంత్రం అంజయ్యతో పాటు సుపారీ గ్యాంగ్‌లోని భాస్కర్, శ్రీకాంత్‌లను కోర్టులో హాజరుపరుస్తారని సమాచారం.

రైతు వేదికలపై పట్టింపేది..?

- నిర్వహణకు అందని నిధులు
- పది నెలలుగా ఎదురు చూపులు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- జిల్లాలో 1.82 లక్షల మంది రైతులు
- 62 క్లస్టర్లలో రైతు వేదికల ఏర్పాటు

జనగామ రూరల్: వ్యవసాయ శాఖ సేవలను రైతులకు మరింత చేరువ చేసేందుకు ఏర్పాటు చేసిన రైతు వేదికల నిర్వహణ కష్టంగా మారింది. సకాలంలో నిధులు కేటాయించక పోవడంతో సర్కారు లక్ష్యం నీరుగారి పోతోంది. ప్రతి ఐదువేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించిన ప్రభుత్వం వారి సేవలను అందుబాటులోకి తేవడానికి క్లస్టర్ల వారీగా రైతు వేదికలు నిర్మించింది. జిల్లాలో 1.82 లక్షల మంది రైతులు ఉండగా.. క్లస్టర్‌కు ఒకటి చొప్పున 62 రైతు వేదికలు ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్మాణానికి రూ.22 లక్షల చొప్పున వెచ్చించిన సర్కారు వాటి నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు ఇవ్వకపోవడంతో నిర్మాణాలు చేపట్టిన నాటి నుంచి వినియోగానికి దూరంగా ఉన్నాయి. రైతులకు క్షేత్ర స్థాయిలో సేవలు అందించడానికి చేపట్టే కార్యక్రమాలకు సంబంధించిన నిధులు 10 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి.

నిర్వణకు నెలకు రూ.9 వేలు

రైతు వేదికల నిర్వహణకు నెలకు రూ.9వేల చొప్పున ఇస్తామని చెప్పిన ప్రభుత్వం 2022 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలలకు గాను రూ.45 వేలు జిల్లా వ్యసాయాధికారి కార్యాలయాల ఖాతాలకు జమ చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకు 10 నెలలు కావస్తున్నా నిధుల జాడ లేదు. జిల్లాకు గత ఏడాది రూ.27.90 లక్షలు మంజూరయ్యాయి. ఈ ఏడాది రూ.55 లక్షల నిధులు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు రాకపోవడంతో ఏఈఓలపై రైతుల వేదికల భారం పడుతోంది.



పెద్దపహాడ్ రైతు వేదిక

ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాం..



జిల్లాలో 62 క్లస్టర్ల ఉన్నాయి. గతంలో ఒక్కో రైతు వేదికకు రూ.9వేల చొప్పున నిర్వహణ ఖర్చుల కింద నిధులు మంజూరయ్యాయి. గడిచిన 10 నెలల నుంచి రావడం లేదు. ఈ విషయమై ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు విడుదల కాగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందజేస్తాం.

– వినోద్‌కుమార్, డీఏఓ

నిర్వహణ ఖర్చు ఇలా ..

రైతు వేదికల ద్వారా క్షేత్ర స్థాయిలో రైతులకు వివిధ రకాల సేవలు అందింటచడానికి ప్రభుత్వం ఇచ్చే నిధులను వెచ్చిస్తుంటారు. ఇందులో ముఖ్యంగా రైతు వేదికల్లో ఇంటర్‌నెట్ సేవలకు అవసరమైన చార్జీలు, పారిశుద్ధ్య పనుల నిర్వహణకు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాలు, రైతు సందర్శన యాత్రలు, ఛాయా చిత్రాల ప్రదర్శన, కరపత్రాల ముద్రణ ఇతర అవసరాలకు ఉపయోగించాల్సి ఉంటుంది. పది నెలలుగా నిధులు రాకపోవడంతో గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నిర్వహించడం లేదు. యాసంగి సీజన్ పోయింది.. ఇప్పుడు వానాకాలం సీజన్ వచ్చింది. రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రత్యేక కార్యక్రమాలకు నిధులు లేకుండా పోయాయి.

క్లుప్తంగా

విద్యార్థి మృతి.. ముగ్గురిపై అనుమానాస్పద కేసు

చిట్యాల : మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన విద్యార్థి చేరాల బిట్టు శుక్రవారం బావిలో ఈత కొడుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై బిట్టు మృతికి కారకులైన ముగ్గురు విద్యార్థులపై అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షాఖాన్ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. తన కుమారుడి మృతి కారణం అదే గ్రామానికి చెందిన శ్రీమంతుల వెంకటేష్, పోగు వెంకటేష్, ఎండీ సద్దాం అని మృతుడి తండ్రి రాజబాబు ఫిర్యాదు మేరకు ముగ్గురిపై అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు ఎస్సై షాఖాన్ పేర్కొన్నారు.

అడ్రస్ సరిగా లేక అభ్యర్థుల ఇబ్బందులు

కేయూ క్యాంపస్: గ్రూప్–4 పరీక్ష హాల్‌టికెట్లలో అడ్రస్ సరిగా లేక కొందరు అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. కొందరు అభ్యర్థులకు కేయూ విద్యారణ్యపురి, కేయూ క్యాంపస్ హనుమకొండ అని హాల్‌టికెట్లలో ఉంది. క్యాంపస్‌కు చేరుకున్న అభ్యర్థులకు ఎక్కడ.. ఏ కళాశాలలో సెంటర్ అనే విషయం తెలియక కలియతిరిగారు. సమయం సమీపిస్తుండంతో టెన్షన్‌కు గురయ్యారు. చివరికి టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి సెంటర్ కోడ్ ద్వారా తమ పరీక్ష కేంద్రం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల అని తెలుసుకొని అక్కడికి పరుగులు తీయాల్సివచ్చింది. అలాగే, కేయూలో కో–ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లో కెనాల్ దగ్గర ఉంటుంది. ఎస్‌డీఎల్‌సీలోనే మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఉండడంతో కొందరు అయోమయానికి గురైతొలుత కొందరు కో–ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రంగా ఉన్న అభ్యర్థులు కొందరు ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు రాగా ఇక్కడ కాదనడంతో మళ్లీ దూరంగా ఉన్న కో–ఎడ్యుకేషన్ కళాశాలకు వెళ్లారు.



భయం.. 'బంధం' దాచింది

తమ్ముడి కళ్లెదుటే నీటిలో మునిగిన అన్న

- అర్ధరాత్రి వరకూ విషయం చెప్పకుండా రోదన
- అనంతరం చెప్పడంతో కుటుంబికుల గాలింపు
- ఘటన జరిగిన తర్వాతి రోజు మృతదేహం లభ్యం
- బయ్యారంలో విషాదం


ఉమర్‌యాసిన్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

బయ్యారం: పాఠశాల, స్నేహితులు, బంధువులు.. ఇలా ఎవరి వద్ద ఏ ఘటన జరిగినా ఒకరికొకరు చెప్పుకునే అన్నదమ్ముల మధ్య 'భయం' తీరని విషాదం మిగిల్చింది. తన కళ్లెదుటే అన్న నీటిలో మునిగిన ఘటనను చెప్పనీయకుండా బందీ చేసింది. అమ్మ, నాన్నకు చెబితే ఏమంటారోననే 'భయం' తో రాత్రి వరకూ నోరుతెరవలేదు. ఫలితంగా ఆ బాలుడు కనిపించని లోకాలకు వెళ్లాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారంలోని ముస్తాఫానగర్‌కు చెందిన షేక్ హుస్సేన్, లాల్‌బీ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దవాడు ఉమర్‌యాసిన్(15) మహబూబాబాద్‌లోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతుండగా.. చిన్నకుమారుడు రహమాన్ బయ్యారంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గ్రూప్–4 పరీక్ష నిర్వహణలో భాగంగా శుక్రవారం పాఠశాలలకు సెలవు ఇచ్చారు. దీంతో మధ్యాహ్నం అన్నదమ్ములు.. మరో ముగ్గురు స్నేహితులతో కలిసి బయ్యారం సమీపంలోని బతుకమ్మబండ ప్రాంతంలోని అలిగేటి వద్దకు వెళ్లారు. ఈ ఐదుగురికి ఈత రాకున్నా సరదాగా నీటిలో దిగారు. ఈ క్రమంలో మలవిసర్జనకు బయటకు వెళ్లిన ఉమర్‌యాసిన్ తిగిరి నీళ్లలో నడుచుకుంటూ తమ్ముడితో పాటు ఉన్న స్నేహితుల వద్దకు వస్తున్నాడు. ఈ క్రమంలో లోతైన ప్రాంతంలో మునిగి రక్షించాలని కేకలు వేయగా తమ్ముడితో పాటు స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఆ ప్రయత్నం ఫలించక వారి కండ్ల ఎదుటే నీటిలో మునిగాడు.

బయటకు తెలపకుండా ఇళ్లల్లోకి..

నీటిలో ఉమర్‌యాసిన్ మునిగిన విషయం బయటకు చెబితే తమకేం జరుగుతుందోననే భయంతో నలుగురు ఎవరి ఇళ్లకు వారు వెళ్లారు. ఈ విధంగానే ఉమర్ యాసిన్ తమ్ముడు కూడా ఇంటికి వెళ్లి మౌనంగా గడిపాడు.

తల్లిదండ్రుల ఆందోళనతో సమాచారం..

చీకటి పడినా కొడుకు రాకపోవడంతో తల్లిదండ్రులు ఉమర్‌యాసిన్ ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. దీంతో రహమాన్.. అన్న వాళ్లు ఏరు వద్దకు ఈతకు వెళ్తామని మాట్లాడుకున్నారని, అక్కడికి వెళ్లి చూడమని బంధువులకు చెప్పగా వారు వెళ్లారు. అక్కడ సైకిల్‌తో పాటు బట్టలు, చెప్పులు కనిపించాయి. ఆ సమయంలో స్థానికుల సహాయం నీటిలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఇంటికి వచ్చిన తరువాత ఏడుస్తున్న రహమాన్‌ను.. ఏం జరిగిందో భయపడకుండా చెప్పమనగా.. ఈతకు వెళ్లి అన్న నీటిలో మునిగిపోయాడని చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.


ఉమర్‌యాసిన్ (ఫైల్)

ఏరులో మృతదేహం లభ్యం..

చిన్నకుమారుడు తెలిపిన ఏరు ప్రదేశంలో శనివారం గజ ఈతగాళ్లు వెతకగా యాసిన్ మృతదేహం లభ్యమైంది. బడికి సెలవు ఇవ్వకపోతే తన కొడుకు బతికుండేవాడని తల్లిదండ్రులు విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఘటనా స్థలిని గార్ల–బయ్యారం సీఐ బాలాజీ, ఎస్‌ఐ రమాదేవి సందర్శించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన రైల్వే జేఏసీ నాయకులు

కాజీపేట రూరల్: కేంద్ర టూరిజం, కల్చరల్ మంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో శుక్రవారం కలిసి కాజీపేటకు సంబంధించిన పలు రైల్వే విషయాలపై వినతిపత్రం అందించినట్లు శనివారం రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు తెలిపారు. కాజీపేట రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ (పీఓహెచ్) నిర్మాణం శంకుస్థాపన చేయడానికి ప్రధాని మోదీని ఈనెల 8న కాజీపేటకు తీసుకరావడం శుభ పరిణామమని వినతిలో పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో అధిక లాభాలు గడిస్తున్న కాజీపేట రైల్వే జంక్షన్‌ను రైల్వే డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని, కాజీపేటకు రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ మంజూరు చేయాలని, రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ (పీఓహెచ్) వ్యాగన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కర్మాగారంలో స్థానిక ప్రజలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి స్పందిస్తూ కాజీపేట రైల్వే జంక్షన్ విషయంలో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడతామని, త్వరలో కాజీపేటకు సంబంధించిన శుభవార్త మీకు తెలియజేస్తామని కిషన్‌రెడ్డి చెప్పినట్లు రైల్వే జేఏసీ నాయకులు తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో పాక వేద ప్రకాశ్, పి.రమేశ్, అనుమాల శ్రీనివాస్, ఎంకె.మూర్తి, బి.మాధవరావు, ఎ.సంతోశ్‌కుమార్, పి.శ్రీనివాస్, జి.భాస్కర్, టి.ప్రవీణ్‌కుమార్, ఆర్.ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న రైల్వే జేఏసీ నాయకులు

ఇద్దరి ప్రాణం తీసిన అతివేగం

- కారు అదుపు తప్పి రోడ్డుపై పల్టీలు
- ఇదరి దుర్మరణం.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- మృతులు నిర్మల్ జిల్లావాసులు
- మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలో ఘటన


అబ్దుల్ సమీర్(ఫైల్)


అలీమొద్దీన్(ఫైల్)

దంతాలపల్లి: కారు అతివేగంతో అదుపుతప్పి రోడ్డుపై పల్టీలు కొడుతూ రోడ్డుపక్కన ఉన్న చెట్టు, విద్యుత్ స్తంభం మధ్యలో చిక్కుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కేంద్రంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. మృతులు నిర్మల్ జిల్లావాసులు. స్థానికులు, ఎస్‌ఐ కూచిపూడి జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన అన్వర్‌ఖాన్ ఖమ్మం జిల్లా మధిర హైడ్రాలిక్ క్రేన్ కొనుగోలు చేశాడు. దానిని తీసుకువచ్చేందుకు శుక్రవారం రాత్రి 10.30 గంటలకు నిర్మల్‌నుంచి కారులో డ్రైవర్ అబ్దుల్ సమీర్(21), క్రేన్ డ్రైవర్ షేక్ అలీముద్దిన్(21), హెల్పర్ షేక్ రెహాన్‌తో కలిసి అన్వర్‌ఖాన్ బయలు దేరారు. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో దంతాలపల్లి మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంక్ సమీపంలోకి రాగానే గేదె అడ్డురావడం.. అప్పటికే కారు వేగం మీద ఉండడంతో అదుపు తప్పి రోడ్డుపై 20 మీటర్ల దూరం వరకు పల్టీలు కొట్టింది. ఆ తరువాత రోడ్డు పక్కన ఉన్న చెట్టు, విద్యుత్ స్తంభానికి మధ్యలో చిక్కుకుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంలో అలీముద్దిన్(21) అక్కడికక్కడే మృతిచెందాడు. కారుడ్రైవర్ అబ్దుల్ సమీర్(21)ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. అన్వర్‌ఖాన్, రెహాన్ తీవ్రగాయాలు కాగా, వారిని చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు సమీర్ మామ మహ్మద్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. తొర్రూరు సీఐ సత్యనారాయణ ఈ ప్రమాదానికి గల కారణాలను విచారణ చేపట్టనునట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ప్రమాద సమయంలో కారు అతివేగం మీద ఉందని, అందుకే కారు గాలిలో ఎగురుతూ పల్టీలు కొట్టినట్లు స్థానికులు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు


ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. వర్షం పడిన సమయంలో తడిగా ఉండే వస్తువులు, స్తంభాలకు విద్యుత్ ప్రసరణ జరిగే అవకాశముంటుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలు, తీగలను ముట్టుకోవద్దని, ముఖ్యంగా బట్టలు ఆరేసే దండెంలకు విద్యుత్ తీగలు తాకకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ ప్రవహిస్తున్న తీగలకు అతుకులు లేకుండా చూసుకోవాలన్నారు. ఆరుబయట విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దన్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరికి వెళ్లొద్దన్నారు. స్టార్టర్ డబ్బాలను నీటిలో తడవకుండా పైకి ఏర్పాటు చేసుకోవాలని, స్టార్టర్‌కు ప్లాస్టిక్, పీవీసీ డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లోల్టేజీ, హెచ్చు తగ్గులు ఉన్నా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తే వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలుపాలన్నారు. తెగిపడిన, వేలాడుతున్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దని, వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలుపాలన్నారు. ఎవరికైనా విద్యుదాఘాతానికి గురైతే ఆ వ్యక్తిని రక్షించాలనే ఆతృతతో ముట్టుకోవద్దని, షాక్ గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని కర్ర, ప్లాస్టిక్ వస్తువులను వాడాలని సూచించారు. పంటలను అడవి జంతువుల బారి నుంచి రక్షించుకోవడానికి విద్యుత్ కంచెలు వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులు టోల్ ఫ్రీ నంబర్ 1800 4250028, 1912కు ఫోన్ చేయాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

ఇల్లు అమ్మబడును

■ WGL, కాశిబుగ్గ, సాయిగణేష్ కాలనీ రోడ్ నెం.4, తూర్పు 30 ఫీట్ల రోడ్డు గల 203 గజాల స్థలంలో 4000/- కిరాయి వస్తున్న ఇల్లు అమ్మబడును. సంప్ర॥ 8919432992. [W-785663]

LAND FOR SALE

■ ధర్మసాగర్ మండలం, బంజర్‌పల్లి గ్రామ శివారులో 4 1/2 ఎకరాల వ్యవసాయ భూమి పట్టా పాస్‌బుక్ మరియు రైతుబంధు వస్తుంది, అమ్మకానికి కలదు. సెల్: 9849359714. [W-785622]

FLAT FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్, అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666 / 8309035091. [WA-27124]

HOUSE FOR SALE

■ ములుగురోడ్డు, కాకతీయ కెనాల్, కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27121]

■ వరంగల్ రంగశాయిపేట శేషాద్రి హిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy. 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666 / 8309035091 [WA-27118]

■ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666 / 8309035091 [WA-27115]

■ S / East 40 Feet Road Corner 390 Sq.Yrds Plot with 1560 Sft G+1 Building at Mamnoor KUDA Layouts Location. 9032111600. [W-785621]

PLOT FOR SALE

■ హన్మకొండ చౌరస్తా నుండి 2KM దూరంలో 300 గజాల ప్లాటు తూర్పు ఫేస్ కలది. ఒక రూమ్ కట్టి ప్లాటు చుట్టూ 5F గోడ గేట్ పెట్టినది. అమ్మకం గ॥ రూ॥ 25000/- ఫిక్స్‌డ్ నో బ్రోకర్స్. 9395561655. [W-785602]

SERVICES

CAFE FOR SALE

■ Own your Dream Cafe for Sale in Prime Location, Fully equipped, loyal Customer base, Seize the Opportunity Today. Cont: 7065002820. [W-785667]

LOANS

■ హన్మకొండ, వరంగల్‌కి 75 కి॥మీ॥ పరిధిలోని గ్రామ పంచాయతీ, మున్సిపల్ పరిధిలో గల ఇల్లు రిజిస్ట్రేషన్ పేపర్ మీద హౌసింగ్, మార్టిగేజ్ లోన్స్ (రుణాలు) ఇవ్వబడును. సెల్: 9885588367. [W-785549]

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [DA-37247]

WANTED

■ **Accountant known Tally / Marketing** Executive Telecaller Please send your resume to info@primetextiles.in Whatapp: 9291271111, Last date to apply 04.07.2023, Interview follows for impressive profiles. [WA-978]

■ **Urgently Wanted RMC Marketing** Managers, Senior Accountants, Senior Civil Engineers, HNK. Drop a Resume in Whatsapp. Cell: 7330891166, 8555890439. [WA-13162]

■ ఆదాయం కోసం ఎదురు చూస్తున్నారా! నిరుద్యోగులకు ఉపాధి (పెట్టుబడి లేదు) స్వచ్ఛంద సేవా సంస్థ నందు క్రౌడ్ ఫండింగ్ చేయుటకు జిల్లా కో-ఆర్డినేటర్ స్త్రీ/పు॥ కావలెను. వీక్లీ 10K. సెల్: 8143909459. [M-1221327]

WANTED TEACHERS

■ **Lady Teachers to teach Pre-Primary** and 1 to 5th all subjects. Supporting teachers for 1 to 5th (P/T or F/T). Fluent in Eng. Indian Kids High School, SVN Road, WGL. Cell No: 9963006221. [W-785672]

■ **To teach Hindi for 8th to 10th, Eng.** Computers for 1 to 5th, Preprimary teachers required. Whatapp resume to 9154665006, Masster High School, Fort Warangal. [W-785671]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


సాయితేజ (ఫైల్)

కమలాపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని ఉప్పలపల్లి వద్ద జరిగింది. మండల కేంద్రానికి చెందిన ఒసుకల సాయితేజ (22) తన మిత్రుడు శనిగరపు శివాజీతో కలిసి బైక్‌పై హుజూరాబాద్‌కు వెళ్లాడు. అనంతరం బైక్‌ను అక్కడ సర్వీసింగ్‌కు ఇచ్చి మరో బైక్‌పై ఒక్కడే కమలాపూర్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో ఉప్పలపల్లిలో మలుపు వద్ద అడ్డు వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సాయితేజకు తీవ్ర గాయాలు కాగా వెంటనే ప్రైవేట్ వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.సంజీవ్ తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి ..


శరత్‌బాబు(ఫైల్)

సంగెం: గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన మండలంలో చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గవిచర్లకు చెందిన కొంతం శరత్‌బాబు (37) గ్రామంలో మెడికల్ షాపు నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం సొంత పనిమీద ఆయన ద్విచక్రవాహనంపై హనుమకొండకు వెళ్లాడు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీ రోడ్ నంబర్ –5 వద్ద గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. ఆయనకు భార్య లావణ్య, కుమారుడు, కూతురు ఉన్నారు. శరత్‌బాబు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


ఏకాంతం మృతదేహం

పర్వతగిరి: పాత కక్షల నేపథ్యంలో బంధువు దూషించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని అన్నారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన వడ్లకొండ ఏకాంతం, యాకలక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కూతుళ్లు, కుమారుడికి వివాహం కాగా కుమారుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో వారం క్రితం ఏకాంతం భార్య యాకలక్ష్మి పెద్ద కుమార్తె అశ్విని వద్దకు వెళ్లింది. ఇంటి వద్ద ఏకాంతం ఒక్కడే ఉంటున్నాడు. కాగా, శనివారం ఉదయం ఏకాంతం తన కుమార్తె అశ్వినికి ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. పాత కక్షల నేపథ్యంలో మరదలు కవిత దూషించడంతోనే తాను చనిపోతున్నానని చెప్పి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై భార్య యాకలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక విద్యార్థిని..


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కేసముద్రం: కడుపునొప్పి భరించలేక ఓ పదోతరగతి విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శనివారం మండలంలోని అమీనాపురంలో జరిగింది. గ్రామానికి చెందిన రావుల ఉపేందర్, స్వరూప దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె వైష్ణవి(15) పెద్దవంగరలోని కస్తూర్బాలో పదో తరగతి చదువుతోంది. అయితే బతుకుదెరువు నిమిత్తం ఉపేందర్, స్వరూప దంపతులు, చిన్నకుమార్తెను తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో వైష్ణవి ఈనెల గత నెల 29న కడుపునొప్పి వస్తుందని తల్లికి సమాచారం అందించింది. పాఠశాలకు వెళ్లిన తల్లి.. కూతురును అమీనాపురంలోని ఇంటికి పంపించి ఆమె హైదరాబాద్‌కు వెళ్లింది. ఈక్రమంలో వైష్ణవికి తన తాత మల్లయ్య భోజనం ఇచ్చేందుకు ఇంటికి వెళ్లగా.. ఆమె ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి కనిపించింది. దీంతో మల్లయ్య పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

'నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు'

నర్సంపేట: ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సీపీఐ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ బాధ్యుడు ఆజాద్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతుందని తెలిపారు. ఎంతో కష్టపడి సంపదించినదంతా పిల్లల చదువుకే ఖర్చు అవుతుండడంతో పేద, మధ్య తరగతి వారు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. వసతులు లేని పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, అర్హత లేని ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉంటే నోటీసులు జారీ చేసి అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శిశువు మాయంపై విచారణ

- నెక్కొండ తండా జీపీలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి.. విచారణ చేపట్టిన అధికారులు


వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

నెక్కొండ: నెక్కొండ తండా జీపీలో జరిగిన శిశువు మాయం ఘటనపై అధికారులు శనివారం విచారణ చేపట్టారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాసంతి కథనం ప్రకారం తండాకు చెందిన బోడ అనూష, స్వామి దంపతులకు మొదట కుమారుడు గణేశ్, తరువాత ఇద్దరు కుమార్తెలు మల్లీశ్వరి, లోకేశ్వరి ఉన్నారు. అనూష.. గత నెల 20న డెలివరీ కోసం వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రికి వెళ్లింది. 24న ఆడ శిశువుకు జన్మనిచ్చిన అనంతరం 28న డిశ్చార్జ్ అయ్యారు. కాగా, 30న శిశువును చూసేందుకు అంగన్‌వాడీ టీచర్ సరస్వతి..అనూష ఇంటికి వెళ్లింది. శిశువు లేకపోవడంతో ఆమె తల్లిని నిలదీసింది. దీంతో ఆస్పత్రికి వచ్చిన గుర్తుతెలియని ఒకరికి పిల్లలు లేకపోవడంతో శిశువును ఇచ్చినట్లు అనూష తెలిపింది. దీనిపై అంగన్‌వాడీ టీచర్ శుక్రవారం ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు తండాలో విచారణ చేపట్టారు. మగసంతానం కోసం వేచి చూసినప్పటికీ మళ్లీ ఆడసంతానం కావడమే కారణమని శిశువు తల్లిదండ్రులు చెప్పారు. శిశువును ఎవరికి ఇచ్చారని ప్రశ్నించగా దంపతులు పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో రెండు రోజుల్లో శిశువును తీసుకువస్తామని చెప్పారని వాసంతి తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ ప్రతినిధి ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విలువలపై అవగాహన ఉండాలి

- పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్



మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ రంగనాథ్

ఎంజీఎం : వైద్య వృత్తి విలువలపై సీనియర్లు..జూనియర్లకు అవగాహన కల్పించాలని వరంగల్ పోలీసు కమిషనర్ రంగనాథ్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా వరంగల్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన వేడుకలకు సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యులు ప్రస్తుత సమాజంలోని మార్పులను గమనిస్తూ ప్రజల ఆలోచనలకు అనుగుణంగా తమ వృత్తిని కొనసాగించాలన్నారు. వరంగల్ కమిషనరేట్‌లో సామాన్య కేసులతో సమానంగా వైద్యవృత్తిపై కూడా పెద్ద ఎత్తున కేసులు నమోదు కావడం ఆశ్చర్యానికి గురి చేస్తుందన్నారు. స్కానింగ్ సెంటర్లతో పాటు ఆర్ఎంపీ, పీఎంపీ వంటి వైద్యులపైనే కాకుండా ఆరోగ్య శ్రీ వంటి విభాగాల్లో సైతం కేసులు నమోదు కావడం విచారకరమన్నారు. ప్రతి ఒక్కరికీ జీవించడానికి సంపాదన కావాలి కాని.. సంపాదనే ధ్యేయంగా ముందుకు సాగొద్దని సూచించారు. అనంతరం పలువురు సీనియర్ వైద్యులను ఐఎంఏ ప్రతినిధులు సన్మానించారు.

'అరుణాచలం'కు అనూహ్య స్పందన

- రాత్రి 10 గంటలకు బయలుదేరిన బస్సు


బస్సు ప్రారంభోత్సవంలో ఆర్ఎం శ్రీలత

హన్మకొండ: ప్రసిద్ధిగాంచిన అరుణాచలం గిరి ప్రదర్శన కోసం వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ కల్పించిన ప్రత్యేక బస్సు సౌకర్యానికి అనూహ్య స్పందన వచ్చింది. ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లోని హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి ఒక సూపర్ లగ్జరీ బస్ నడపాలని యాజమాన్యం నిర్ణయం తీసుకుని విస్తృత ప్రచారం చేసింది. దీనికి భక్తుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. సూపర్ లగ్జరీ బస్సులో 31 సీట్లు ఉంటాయి. కాగా, 72 మంది రిజర్వేషన్ చేయించుకోవడంతో అదనంగా మరో సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశారు. ఈ రెండు బస్సులు శనివారం రాత్రి 10 గంటలకు హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి అరుణాచలం బయలు దేరాయి. ఈ బస్సులను వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాము ఊహించని విధంగా భక్తుల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ప్రయాణికులకు కావాల్సిన సేవలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వరంగల్–1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్‌రావు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఎస్.ఆర్.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి

కేయూ క్యాంపస్: విశ్వవిద్యాలయాల్లోని ఉద్యోగులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని తెలంగాణ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని ఫిజిక్స్ సెమినార్ హాల్‌లో తెలంగాణలోని పలు యూనివర్సిటీల నుంచి నాన్ టీచింగ్ పెన్షనర్ల సంఘాల ప్రతినిధుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రెండు డీఏలు, పీఆర్సీలను వెంటనే ప్రకటించాలన్నారు. అలాగే, అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కేయూ నాన్‌టీచింగ్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరావు, జనరల్ సెక్రటరీ డాక్టర్ నాగేశ్వర్ రావు, బాధ్యులు ఎస్ఎస్ఆర్.మూర్తి, ఎం.లక్ష్మారెడ్డి, గిడియన్, అమీన్, చంద్రమౌళి, నర్సింహామూర్తి, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జనరల్ సెక్రటరీ యాదగిరి పాల్గొన్నారు.

అకౌంట్ నుంచి రూ. 20 వేలు మాయం

రామన్నపేట : తన అకౌంట్ నుంచి రూ. 20 వేలు వేరే అకౌంట్‌లో జమ కావడంతో ఆశ్చర్యపోయిన బాధితుడు.. శనివారం ఇంతేజార్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాశిబుగ్గ వివేకానంద కాలనీలో నివాసముండే బెజ్జంకి కిశోర్ కృష్ణ కాలనీలోని కెనరా బ్యాంక్‌లో అకౌంట్ ఉంది. ఈ అకౌంట్ నుంచి మే నెలలో గుర్తు తెలియని వ్యక్తికి అకౌంట్‌కు రూ. 20 వేలు బదిలీ అయ్యాయి. ఈ విషయాన్ని బాధితుడు యూపీఐ ఐడీ ద్వారా గుర్తించాడు. వెంటనే బ్యాంకు వెళ్లి ప్రశ్నించగా వారు 1930 కాల్ చేయమని చెప్పారు. దీంతో వారికి కాల్ చేయగా ఈ నంబర్ ఫేక్ నంబర్ అని ధ్రువీకరించారు. దీంతో బ్యాంకు వివరాలతో బాధితుడు ఇంతేజార్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గేదెను ఢీకొని నిలిచిన రెలు..

మహబూబాబాద్ రూరల్ : గేదెను ఢీకొని ఎల్టీటీ రైలు నిలిచిన ఘటన శనివారం మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. విశాఖపట్నం నుంచి ముంబై వెళ్తున్న లోకమాన్య తిలక్ టెర్మినల్ ఎక్స్‌ప్రెస్ (ఎల్టీటీ) రైలు మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు రెండు గుట్టల ప్రాంతంలో 431/1 మైలురాయి వద్దకు రాగానే ఒక్కసారిగా పట్టాలపైకి ఓ గేదె వచ్చింది. దీంతో ఆ గేదెను ఢీకొని రైలు నిలిచింది. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని మరమ్మతులు చేపట్టి పంపించారు.